తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అట్టహాసంగా గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తక ఆవిష్కరణ






# రూపు రేఖలు మారనున్న కైలాసగిరి పర్వత పంక్తులు

## రూ.2కోట్లతో నగరవనం -రామాపురం రిజర్వాయర్ సమీపంలో ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త

పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఈ దివ్యక్షేత్రంలో ఆలయానికి అనుబంధంగా కైలాసగిరి పర్వత పంక్తులు 22 కిలో మీటర్లు ఉన్నాయి. రూపు రేఖలు మారనున్న కైలాసగిరి పంక్తుల రూపు రేఖలు మారనున్నాయి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2కోట్లతో నగరవనం అభివృద్ధి చేయనున్నారు. ఆధ్యాత్మిక చింతన వెల్లివిరిసే ఈ కైలాసగిరుల్లో అద్భుతమైన శోభ చోటు చేసుకుంది. ఈ గిరుల నుంచే తెలుగుగంగను తిరుపతి వాసుల దాహార్తిని తీర్చుటకు 'రామాపురం రిజర్వాయర్‌ను' ఏర్పాటు చేసారు. ఈ సమీపంలో 'నగరవనం'ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీశాఖ నిర్ణయించింది.



**రూ. 2కోట్లతో నగర వృనం:**

శ్రీకాళహస్తి ఆధ్యాత్మిక క్షేత్రంలో రూ. 2కోట్లతో నగరవనం పథకం కింద కైలాసగిరి నగరవనం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు అటవీశాఖ అధికారి లోకేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాంతపు రోజుల్లో పట్టణ ప్రజలు ఆహ్లాదకరంగా కుటుంబస భ్యులతో గడిపేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 50హెక్టార్లలో పచ్చదనం పెంపుతో పాటు సాహసోపేతమైన క్రీడలు, మానసికోల్లాసం కలిగించే వాతావరణాన్ని నగరవనంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగవనాలను ఏర్పాటు చేస్తూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే పథకాన్ని తీసుకొచ్చారని నగరవనం పథకం కింద ఏర్పాటు చేయడంతో పాటు కైలాసగిరి కొండల్లో రిజర్వ్‌ఫారెస్టు ప్రాంతంలో చెట్లు లేని భూములను గుర్తించి అక్కడ పచ్చదనం పెంపు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే విధంగా వివిధ రకాల ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగిస్తూ వాకింగ్ ట్రాక్, వ్యాయామం తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు. రామాపురం రిజర్వాయర్ నుంచి రిజర్వ్ ఫారెస్టు వరకు బోట్‌క్లబ్, రోప్‌వే వంటి ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగించేలా ప్రణాళికలతో పాటు అంచనాలు రూపొందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా కొండపైకి ట్రెక్కింగ్ చేసి సాహసోపేతమైన క్రీడను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దశల వారీగా ఈపథకాన్ని అమలు చేస్తూ సౌకర్యాలు కల్పించే ప్రతిపాదనలు ప్రభుత్వం ఆమోదం లభించిందని త్వరలోనే పనులు చేపడుతామన్నారు.

**గిరిప్రదక్షిణకు పెరుగుతున్న ఆదరణ:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కైలాసగిరి పర్వత పంక్తుల్లో గిరి ప్రదక్షిణకు రోజు రోజుకు ఆదరణ పెరుగుతుంది. గిరి ప్రదక్షిణ ప్రాధాన్యతను చాగంటి కోటేశ్వరరావు వివరించటంతో పాటు ఆయన స్వయంగా పాల్గొనటంతో పాటు గత పాలకులు రూ. 18కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్లు నిర్మించటంతో ఈ ప్రాంతాలకు ఎనలేని ప్రాధాన్యత చోటు చేసుకుంది. ప్రస్తుతం నగరవనంకు ప్రత్యేక నిధులు మంజూరు కావటంతో టూరిజంకు అత్యధిక ప్రాధాన్యత సంతరించుకోనుంది. ప్రస్తుతం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు వేయిలింగాల కోనకు వెళుతున్నారు. నగరవనంతో పార్కులు అభివృద్ధి జరిగితే ఈ ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి సాధించనున్నాయి. ప్రస్తుతం ఏడాదిలో సంక్రాంతి, శివరాత్రికి నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణ ప్రతి పౌర్ణమికి జరుగుతుంది. రాబోవు రోజుల్లో ఈ ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతాయనటంలో సందేహం లేదు. నిధుల కేటాయింపుల్లో శ్రీకాళహస్తికి ప్రాధాన్యత ఇచ్చిన డెప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను ఈ ప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు.




## లక్ష్యాలు నిర్ధేశించుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు - విద్యార్థినిలకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపు

చిత్తూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త:

పోటీ ప్రపంచంలో విద్యార్థినిలు లక్ష్యాలను నిర్ధేశించుకుని నైపుణ్యంను పెంపొందించుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. చిత్తూరు సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిధిగా హాజరై కళాశాల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థినిలు ఆకర్షణకు లోనుకాకుండా క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిందని, దీనిని అందిపుచ్చుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బుందేల్‌ఖండ్ తరహాలో శ్రీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేయడానికి ఎంపీ చొరవ చూపాలని వారు కోరారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినిలకు బిసీ హాస్టల్ ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు.



## చెరువులో దూకి ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

### - 27 రోజుల క్రితమే కవలలకు జన్మ.. కుటుంబ వ్యవహారాలే కారణం..?

కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త ్ర ముక్కుపచ్చలారని ఇద్దరు కవలలకు జన్మనిచ్చిన తల్లి.. తన కుటు ంబంలో చోటు చేసుకున్న పరిస్థితులను తలచుకుని మనోవేదనకు గురై చిన్నారులను వదిలి ఏకంగా చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని బంగానత్తం చెరువు వద్ద చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం పట్టణంకు చెందిన శ్రీదేవి (49)కి మదనపల్లికి చెందిన చిన్నప్పతో 2020లో వివాహమైంది. చిన్నప్ప కూడా తన భార్యతో కలసి కుప్పంలోనే ఉ ండేవాడు. శ్రీదేవి కుప్పం పట్టణంలోని ఆర్. పేట హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. 27 రోజుల క్రితం ఈమె ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. అయితే ఈమె కుటుంబీకులైన తల్లి, అక్క తదితరులు ఈమెను పట్టించుకునేవారు కాదని పెళ్లి, పిల్లల విషయంలో వారు అవసరం ఏముంది అనే రీతిలో మాట్లాడేవారని శ్రీదేవి తన సహచర ఉపాధ్యాయురాళ్లతో సైతం పేర్కొన్నట్లు సమాచారం. పెళ్లి సమయంలో కూడా పెళ్లికి ఎందుకు తొందర అని, పిల్లలు కనాలని యత్నిస్తే ఇప్పుడే వద్దని ఆమె కుటుంబీకులు పేర్కొనడంతో శ్రీదేవి మనోవేదనకు గురైనట్లు సమాచార ం. ఇటీవలే 27 రోజుల క్రితం కవలలకు జన్మనిచ్చిన శ్రీదేవి మెటర్నటీ లీవ్‌లో ఉన్నారు. తన తల్లి, అక్కలు సైతం వచ్చి తనను చూడకపోవడంతో మనోవేదనకు లోనైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శ్రీదేవి హఠాత్తుగా కుప్పం సమీపంలోని బంగానత్తం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సంఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






## రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం ఆలస్యంపై గ్రామస్థుల ఆందోళన

- రైల్వేట్రాక్‌పైకి చేరి రైలు నిలిపేసే ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసు, రైల్వే భద్రత దళాలు
- నాలుగు మాసాల్లో నిర్మిస్తామని రెవెన్యూ అధికారులకు హామీ
- తీవ్ర ఉద్రిక్తతల మధ్య శాంతించిన పెరియవట్టు పంచాయతీ ప్రజలు



తడ, ఆగస్టు 30 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా తడ మండలం పెరియవట్టు వద్ద రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం ఒకటిన్నరేళ్లుగా ఆలస్యం కావడంతో గ్రామస్థులు శుక్రవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. రైల్వేలైను పైకి చేరి రైళ్ల రాకపోకలను అడ్డుకుంటామని ముందురోజే వీరు ప్రకటించారు. ఈ మేరకు రైల్వే బ్రిడ్జికి ఇరువైపులా బోర్డులు కూడా వేశారు. గురువారం అక్కడికి పోలీసులు, స్థానిక అధికారులు వెళ్లి నచ్చజెప్పినా గ్రామస్థులు ఒప్పుకోలేదు. శుక్రవారం వారు చెప్పినట్టుగానే కనీసం 300 మంది రైల్వేలైనుకు చేరుకున్నారు. దీనితో రైల్వేశాఖ ఉన్నతాధికారులు దిగిరాక తప్పలేదు. స్థానిక పోలీసులు, అధికారుల సమక్షంలో రైల్వ ఉన్నతాధికారులు హామీలిచ్చారు. ప్రత్యామ్నాయ రోడ్డు వసతి కల్పిస్తామన్నారు. నాలుగు నెలల గడువు కావాలని కోరారు. అయినా గ్రామస్థులు చాలాసేపు వినలేదు. తాము ఏ దారీ లేకుండా రైల్వేలైను అవతల నిలిచిపోయి వస్తు సామగ్రిని కూడా కట్ట మీద నడిచి తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. పెరియవట్టు పంచాయతీ పరిధిలోని పెరియవట్టు కుప్పం, బాలాజీకుప్పం, పకీరుకండ్రిగ, కావలిమిట్ట వంటి గ్రామాలకు ఒకటిన్నరేళ్లుగా దారి మూసుకుపోయిందని, తాము ఎన్నిసార్లు ఆందోళన చేసినా పట్టించుకోలేదన్నారు. కనీసం చేపలు విక్రయించుకునేందుకు ఇతర గ్రామాలకు వెళ్లే సౌకర్యం కూడా కరువయిందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారులు వికాస్ జయదేవ్, మురారి కుమార్‌లు, తడ తహశీల్దార్ శరత్, ఎంపిడిఓ విజయకుమార్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండప్పనాయుడు తదితరులు గ్రామ పెద్దలతో చర్చించారు. నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వక హామీ ఇస్తామన్నారు. దీనితో ఆందోళనకారులు ఇష్టం లేకపోయినా మండల స్థాయి అధికారులు, పోలీసుల సర్దుబాటుతో వెనక్కు మళ్లారు. అయితే రైల్వే భద్రత దళాలు, పోలీసులు, రైల్వే కాంట్రాక్టర్లకు సంబంధించిన మనుషులు కూడా అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఎటువైపు వెళుతుందో అన్న ఆందోళన కొనసాగింది. ఎట్టకేలకు ప్రస్తుతానికి అక్కడ ఆందోళన సర్దుమణిగినా, ఇచ్చిన హామీని రైల్వే అధికారులు నెరవేర్చాల్సి న అవసరాన్ని ఆంధ్రా, తమిళనాడు సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.











## దేవాదాయశాఖ మంత్రి చేతుల మీదుగా గోడపత్రికలు, బ్రోచర్ల ఆవిష్కరణ

కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకసా ్వమివారి దేవస్థానంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు, గణేష్‌దీక్షలకు సంభందించి ముద్రించిన గోడపత్రికలు, బ్రోచర్లను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. దేవస్థానంలో సెప్టెంబర్ 7 నుండి 27 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు జరుగనున్నాయి. అమరావతిలో శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, దేవాదాయశాఖ కమీషనర్ సత్యనారాయణ, కాణిపాకం ఆలయ ఈఓ కె. వాణిలు స్థానిక టీడీపీ నాయకులతో కలసి మంత్రని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాల ప్రచారంలో భాగంగా దేవస్థానం ముద్రించిన గోపడపత్రికలు, బ్రోచర్లును, గణేష్‌దీక్ష గోదపత్రికలను మంత్రి రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం దేవస్థానం తరపున అర్చకులు, వేపదండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యాక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు గిరధర్‌బాబు, నాయకులు హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, హరిబాబునాయుడు, తెల్లగుండ్లపల్లె మోహన్‌నాయుడులతో పాటు ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.



## చెక్కునత్తంలో ఎమ్మెల్సీచే సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

కుప్పంరూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త



మండలంలోని చెక్కునత్తం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు గాను శుక్రవారం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో అవసరం ఉన్న సిసి రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలోనే సిఎం చంద్రబాబునాయుడు పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తారని తద్వారా పంచాయతీల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు సత్యేంద్రశేఖర్, మహేంద్ర, చెక్కునత్తం మణి, రాజగోపాల్, శివకుమార్, జెఎంసి మురళి, వివిఎస్ ఛైర్మన్ కనకరాజ్, జెకె సంతోష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్సీడా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పంరూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త



కుప్పం ఆర్టీసీ డిపో నుంచి కుప్పం – తిరుపతి మార్గంలో నడిపేందుకు రెండు నూతన ఆర్టీసీ సర్వీసులను ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కుప్పం నుంచి వివిధ ప్రాంతాలకు నూతనంగా సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం బస్టాండును మోడల్ బస్ స్టేషన్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గత వైకాపా పాలనలో కుప్పం డిపోలోని బస్సులను పుంగనూరు, ఇతర డిపోలకు తరలించుకుపోయారని మరలా ఆ బస్సులను వెనక్కు రప్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, వేలు, ఎంఆర్ సురేష్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, మణి, కనకరాజు, మురళి, శ్యాంసుందర్, సతీష్, జనసేన నరేష్, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓచే పాఠశాల ఆకస్మిక తనిఖీ

శాంతిపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త

మండలంలోనిమఠం పంచాయతీ పొన్నేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స ంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరీగోడ మంజూరు చేయాలని ఎంపిడిఓను కోరారు. దీనిపై ఎంపిడిఓ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్, విద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒక్క రోజు ముందుగానే నేడు పెన్షన్లు పంపిణీ

– 2.70 లక్షల లబ్దిదారులకు రూ.114 కోట్లు అందజేతకు పక్కా ఏర్పాట్లు

– కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త:** సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను లబ్దిదారులకు ఒక్క రోజు ముందుగానే అంటే శనివారం తెల్లవారుజాము నుండి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్ళి అందించనున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 2,70,543 మది లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రూ.114.12 కోట్లు అందజేయనున్నామని తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుండి సామాజిక పెన్షన్ల పంపిణీకి ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన సామాజిక పెన్షన్ల పంపిణీని ఆగస్టు 31న అంటే ఆదివారం నాటికే వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఒకవేళ ఆదివారం పెన్షన్ల పంపిణీ పూర్తి కాని పక్షంలో మిగిలిన లబ్దిదారులకు సెప్టెంబర్ 2వ తేదీ పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

## కె.పట్నం వద్ద అనుమానాస్పదరీతిలో మహిళ మృతి

**తవణంపల్లె, ఆగస్టు 30 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండ–చిత్తూరు రహదారి కె.పట్నం సిక్స్‌లేన్ సమీపంలో చెట్టు వద్ద ఒక మహిళ అనుమానాస్పదరీతిలో మృతి చెంది పడివుండడాన్ని స్థానికులు శుక్రవారం కనుగొని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. కె.పట్నం ఫ్లైఓవర్‌కు సమాపంలోని ముష్టి చెట్టు కింద సుమారు 40 ఏళ్ళు వయస్సు కలిగిన ఓ మహిళ సుమారు నాలుగైదు రోజుల క్రితం అనుమానాస్పదరీతిలో మృతి చెందింది. ఈవిషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక ఎస్సై చిరంజీవి తమ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ చీర, జాకెట్ దరించి వుంది. ఈమె ఎవరు, అక్కడికి ఎందుకు వెళ్ళింది? మృతికి గల కారణాలు తెలియాల్సి వుంది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఈ పంట నమోదు తప్పనిసరి

యర్రావారిపాలెం,ఆగస్టు30ప్రభాతవార్త

ప్రతి రైతు తన పంటలను ఈ క్రాప్ కింద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఖాదర్‌భాషా తెలిపారు. రైతులు వేసిన పంటని ఈ క్రాప్ చేయించడ ం వలన పంట బీమా, సున్నావడ్డీ,పంట సేకరణ, పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులు అవుతారన్నారు. రైతులు అందరు ఈ ఖరీఫ్ సీజన్లో పండించిన ప్రతి పంటను మీ రైతు సేవ కేంద్రంలో ఉన్న సిబ్బంది వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

## కాణిపాకం ఆలయానికి రెండు లక్షలు విలువగల కూరగాయలు వితరణ



**కాణిపాకం,ఆగస్టు 30 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అమలవుతున్న నిత్యాన్నదాన పథకంకు భక్తులు శుక్రవారం సుమారు రెండు లక్షలు రూపాయలు విలువగల కూరగాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు పలమనేరు కూరగాయల మర్చంట్ రవీంద్రరెడ్డి బృందం వివిధ రకాల కూరగాయలను ఆలయానికి విరాళంగా అందజేశారు. వీటిని ఆలయ ఏఈఓ ధనుంజయ, సూపరెండెంట్ రంగస్వామికి అందజేశారు. దాతలకు ఆలయ సం రపదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, దాతలు పాల్గొన్నారు.

## జీవవైవిధ్య సమతుల్యత లక్ష్యంగా విధులు

– ప్రకృతి పరిరక్షణకు విరివిగా మొక్కల పెంపకం

– అటవీ సంపద రక్షణకు అటవీశాఖతో ప్రజలు భాగస్వామ్యం

– ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త:** భూమిపై వున్న ప్రతి జీవి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వృక్ష సంపదపై ఆధారపడి వుందని, ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి అటవీ సంపదను పెంపొందించుకుని వాటిని సంరక్షించుకోవాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. చిత్తూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు అటవీ సంరక్షణ ప్రాధాన్యతను తెలుసుకోవాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వృక్ష సంపద సైతం పెరిగేలా కృషి చేయాలన్నారు. వృక్ష సంపదను పెంపొందించుకోవడం ద్వారా వాతావరణంను కాపాడుకోవచ్చునని, చిన్న క్రిమి నుండి మావన జాతి వరకు అందరు వృక్ష సంపదపై ఆధాపడి వున్నారన్న విషయం ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. జీవ వైవిధ్య సమతుల్యతను పాటించడానికి అందరు నడుంబిగించాలని ఆయన పిలుపునిచ్చారు. వృక్షాలు గాలిలోని కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకుని మానవాళికి అవసరమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తుందని, వర్షాలకు మూలాధారమని, భూతాపంను తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ప్రకృతిని మనం కాపాడుకున్నప్పుడే మనిషి యొక్క జీవన ప్రమాణాలు బాగుంటాయన్నారు. అడవులను నరికివేయడం ద్వారా ప్రమాదాలను మనమే కొని తెచ్చుకుంటున్నామన్నారు. అటవీ సంరక్షణకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపట్టి మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అడవులు రోజు రోజుకు తగ్గిపోతున్నాయని, పచ్చదనం కనుమరుగు అవుందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. మేయర్ అముద మాట్లాడుతూ రాష్ట్రం పచ్చగా వుండాలని, ప్రకృతిని పరిరక్షించుకోవాలని సిఎం నారా చంద్రబాబునాయుడు ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండి మొక్కలు నాటే వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అటవీశాఖ నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఓ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## దోమల కట్టడికి డ్రోన్‌తో నీటి కుంటలపై మందు పిచికారి

**చిత్తూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా మున్సిపల్ మున్సిపల్ ఆరోగ్య విభాగం దోమలపై యుద్ధం ప్రకటించారు. దోమలు బయటికి రాకుండా వాటిని లార్వా దశల్లోనే నాశనం చేయాలని నిర్ణయించిన మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ పర్యవేక్షణలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది దోమలను కట్టడి చేయడానికి పలు రకాల చర్యలు చేపట్టారు. నీటి నిల్వ వున్న ప్రాంతాల్లో లార్వా దశ నుండి దోమలు వృద్ధి కాకుండా వుండటానికి డ్రోన్ సహాయంతో మందును పిచికారి చేస్తున్నారు. శుక్రవారం 34వ డివిజన్ పరిధిలోని నీవానది ప్రాంతం, 5వ డివిజన్ పరిధిలోని కామేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో మున్సిపల్ హెల్త్ విభాగం సిబ్బంది మనుషులు వెళ్ళలేని నీటి కుంటలు, కాలువలపై దోమలను కట్టడి చేయడానికి వెక్టోబాక్ బయోలాజికల్ ఇన్సెక్టిఫైడ్ మందును పిచికారి చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మృత్యుంజయేశ్వరుని సేవలో జడ్జి కృష్ణవంశీ

చౌడేపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త



స్థానిక మృత్యుంజయేశ్వరస్వామిని పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ కృష్ణవంశీ దర్శించుకొన్నారు. ఉదయాన్నే ఆయనకు ప్రధానార్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమార స్వామి, మహేష్‌లుజడ్జి కుటుంబసభ్యులను ఆలయ మర్యాదలతో మృత్యుంజయేశ్వరస్వామి,ప్రసన్నపార్వతీదేవీదర్శనభాగ్యంకల్పించారు. అనంతరం మండపంలో వేదాశీర్వాదం పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు అంబేద్కర్ చిత్రపటాలు

చౌడేపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త



మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు భారతరత్న అంబేద్కర్ చిత్రపటాలందించారు. ప్రతి కార్యాలయంలోనూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటముండాలని ఆసంఘ జిల్లా ఉపాధ్యక్షుడుశివకుమార్అన్నారు. నియోజకవర్గఇన్‌ఛార్జీ కృపామణి, మండలాధ్యక్ష, ఉపాధ్యక్షులు కొత్తపల్లి మణి, కూర పర్తి ఈశ్వర్, వై. రెడ్డిప్రసాద్, శ్రీరాములు, యువజన అధ్యక్షుడు ముకుందా, ఉపాధ్యక్షుడు ఎల్లకుంట్ల మణి, కార్యదర్శి సురేష్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, రాజశేఖర్, గంగులప్ప, చరణ్‌పాల్, మండల నాయకులు పాల్గొన్నారు.

## లోక కళ్యాణం కోసం శ్రీనివాస కళ్యాణం



**పుంగనూరు,ఆగస్టు 30 ప్రభాతవార్త** సమాజంలో శాంతి, ఆరోగ్యం, సంక్షేమంవర్ధిల్లాలనే కోరికతోనే పుంగనూరులో శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు బిసివై జాతీయ అధ్యక్షుడు బోడెరామచంద్రయాదవ్ కోరారు. శుక్రవారం ఈమేరకు ఆయన రాంపల్లి వద్ద ఏర్పాటుచేసిన శ్రీనివాస కళ్యాణం వేదిక వద్ద విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణం దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామివారి కృపతోనే సాధ్యమౌతుందని, ఆయన కరుణాకటాక్షాలు లోకంపై ఉండాలనే మంచి సంకల్పదీక్షకు ప్రజలందరూ తరలిరావాలన్నారు. దాదపు పదివేలమంది భక్తులు కూర్చుని తిలకించే విధంగా వేదికను సిద్ధం చేశారు. దీంతో పాటూ కళ్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకుప్రసాద వితరణలకు కూడా ఏర్పాట్లు సిద్ధంచేశామని వివరించారు. పుంగనూరు మదనపల్లి మార్గంలోని రాంపల్లి ప్రధాన కూడలి వద్ద బస్టాప్‌కూడా ఉండడంతో ఈఉత్సవాని పుంగనూరు నియోజకవర్గంతో పాటూ మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.

## దళితులకు న్యాయం చేయండి

పుంగనూరు,ఆగస్టు 30 ప్రభాతవార్త



నియోజకవర్గంలో దళిత సమస్యలపై సత్వర చర్యలు తీసుకునే పోలీసు యంత్రాంగం స్పందించాలని కోరుతూ దళిత సంఘాలుసర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు విజ్ఞప్తిచేశాయి. ఈమేరకు మధ్యాహ్నం ఆయనను కలసిన రాష్ట్ర దళిత సంఘ అధ్యక్షుడు శంకరప్ప సిఐను శాలువతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ,మండల పరిధిలోని పలు దళితుల కేసులు అపరిష్కారంగా ఉన్నాయన్నారు. రాజ్యాంగం పొందుపరిచిన రీతిలో దళితులు అన్యాయాలకు,ఇతర సామాజిక ఇబ్బందులకు గురైనపుడు చట్టరీత్యా తమ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి వైరు చోరీ

సదుం,ఆగస్టు30ప్రభాతవార్త



మండల పరిధిలోని ఒక రైతుకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి రాగి వైరును చోరీ చేసుకువెళ్లిన సంఘటన జరిగింది. బాధిత రైతు తెలిపిన మేరకు మండల పరిధిలోని ఊటుపల్లె పంచాయతీ తుమ్మగుంటపల్లెకు చెందిన కృష్ణయ్య అనే రైతుకు చెందిన పొలం వద్ద 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించుకుని వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. గురువారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం పొలానికి నీరు కట్టేందుకు పొలంవద్దకు వెళ్లాడు. అక్కడ చూస్తే ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి కనపడింది. అక్కడికి వెళ్లి పరిశీలించగా అందులోని రాగి వైరు కనపడలేదు. రాగివైరు చోరీ అయిందని గమనించి వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలిపాడు. అనంతరం సదుం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## శ్రీచెంగాళమ్మకు పుష్పయాగం

సూళ్లూరుపేట, ఆగస్టు 30 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో శ్రావణమాసం శుక్రవారాన్ని పురస్కరిం చుకొని అమ్మణ్ణికి వివిధ రకాల పుష్పాలతో యాగం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమైన యాగం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిసింది. యాగానికి నంబూరి మనోజ్ కుమార్, నంబూరి రామ్మోహన్‌రావు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్‌దువ్వూరుబాలచంద్రారెడ్డి,ఇన్‌ఛార్జ్‌కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకి, వైసిపి పార్టీకి రాజీనామా చేసిన బల్లి కళ్యాణ్ చక్రవర్తి

వెంకటగిరి, ఆగస్టు 30, ప్రభాతవార్త



ఎమ్మెల్సీ పదవికి, వైసిపి పార్టీకి బల్లి కళ్యాణ్ చక్రవర్తి రాజీనామా చేశారు. వెంకటగిరికి చెందిన బల్లి కళ్యాణ్ చక్రవర్తి మాజీ మంత్రి, మాజీ ఎంపీ బల్లి దుర్గాప్రసాదరావు మృతి చెందడంతో తనయుడు కావడంతో ఆయనకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యేల కోట కింద ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. బల్లి కళ్యాణ్ చక్రవర్తి సొంత కారణాల రీత్యా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని మండల ఛైర్మన్‌కు అందజేశారు. తెలుగుదేశం పార్టీలో ఆయన చేరవచ్చు అని ఆయన అనుచరులు భావిస్తున్నారు. తండ్రి బల్లి దుర్గాప్రసాద రావు టిడిపిలో ఆయన ఎమ్మెల్సీగా మంత్రిగా పనిచేసారు. 2019 ఎన్నికల్లో తిరుపతి ఎంపిగా వైసిపి నుండి బల్లి పోటీ చేసి విజయం సాధించారు. ఆయన అకాల మరణం చెందడంతో తనయుడైన కళ్యాణ్ చక్రవర్తికి ఎమ్మెల్సీ పదవిని జగన్మోహన్ రెడ్డి ఇచ్చారు.

## ఆర్టీసి డిపో వద్ద నిరసన తెలిపిన కార్మికులు

వెంకటగిరి, ఆగస్టు 30, ప్రభాతవార్త



రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉదయం వెంకటగిరి డిపోలో ఫస్ట్ డ్యూటి మొదలు అన్ని డ్యూటీలకు వెళ్ళు ఎన్‌ఎంఏపీటిడి ఉద్యోగులు నల్ల రిబ్బన్ ధరించి డిపో నందు నిరసన చేశారు. ఉదయం ఉద్యోగులపై ట్రెజరీ అధికారులు చూపుతున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రిజినల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సతీష్ బాబు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహిస్తు ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను ప్లే కార్డ్‌లు చూపిస్తూ నిరసన తెలిపారు. డిపో సెక్రెటరీ మాట్లాడుతూ ట్రెజరి అధికారులు పిటిడి ఉద్యోగులపై వివక్షత మానుకొని తమ న్యాయమైన డిమాండ్లు వవెంటనే పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కారం కొరకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ విపి రావు, డిపో కార్యదర్శి కెవి రత్నం, వైస్ ప్రెసిడెంట్ కెఆర్ బాబు, జాయింట్ సెక్రటరీ ఎస్కె గౌస్ భాషా, సుబ్బారావు, విజయకుమార్, గ్యారేజ్ జాయింట్ సెక్రటరీ ఎన్. కృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

వాకాడు, ఆగస్టు 30, ప్రభాతవార్త



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తహశీల్దార్ రామయ్య అన్నారు. శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వాకాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణంలో తహశీల్దార్ రామయ్య మొక్కలను నాటారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామయ్య మాట్లాడుతూ రాష్ట్రం పచ్చదనంతో నింపుకొనుటకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా వన మహోత్సవ కార్యక్రమం జయప్రదం చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కల పచ్చదనంతో కళకళలాడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణ కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ విజయ, విఆర్ఓ కోటమ్మ, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న ఆక్వా రైతులు

**గూడూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త** ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని, దీని పై రైతులందరూ సమిష్టిగా పోరాటం చేయాలని ఆక్వా రైతుల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతు రవీందర్ రెడ్డి కోరారు. గూడూరు పట్టణంలో డివిజన్‌లోని ఆక్వా రైతులు సమావేశం నిర్వహించి రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ఆక్వా రైతు రవీందర్ రెడ్డి మాట్లాడఉతూ రొయ్యల ధరలను ఎక్స్‌పోర్టర్లు సిండికేట్‌గా మారి నాణ్యమైన సీడ్ వ్యాపారస్తులు అమ్మేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాసిరకం సీడ్ అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులంతా సమిష్టిగా పోరాటం చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని సూచించారు. శ్రీనాథ్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కాలేషా పాల్గొన్నారు.

## రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే మొక్కలు నాటే కార్యక్రమం



**చిల్లకూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త** చిల్లకూరు మండలంలోని పున్నపువారిపాలెం ప్రాథమిక పాఠశాలలోపర్యావరణపరిరక్షణలోభాగంగారాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో 50 మొక్కలను నాటారు. అదే విధంగా పారిచర్లవారిపాలెం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం రాజు, విద్యా కమిటీ ఛైర్మన్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఎంపిపి తంబి రెడ్డి తనుజారెడ్డి



**వెంకటగిరి, ఆగస్టు 30, ప్రభాతవార్త** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపిపి తంబిరెడ్డి తనుజ రెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవం సందర్భంగా వెంకటగిరిలోని నగరవణం లో ఎంపిపి మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు అటవీ శాఖ అధికారులు కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. సిఎం చంద్రబాబు నాయుడు డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌లో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. పిల్లల పుట్టిన రోజు సందర్భంగా వారిచేత మొక్కలు నాటిస్తే అవి పెరిగేకొద్దీ గుర్తుగా ఉంటాయని చెప్పారు. మాజీ ఏఎంసి చైర్మన్ పులికల్లు రాజేశ్వర రావు మాట్లాడుతూ 2018 సంవత్స రంలోనే సిఎం చంద్రబాబు నాయుడు నగరవణాన్ని ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రేంజర్ బి రాజేంద్రప్రసాద్, ఏపిపి ప్రకృతి కుమార్, డిఆర్‌ఓలు విజయకుమార్, కోటేశ్వరరావు, ప్రతాప్ రెడ్డి, సుహాసిని, ఎంపిడివో కోటేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, శివారెడ్డి, జనసేన నేత రామారావు, నిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్తురుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

## మంత్రి రామనాయుడుని కోరిన ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 30, ప్రభాతవార్త



ఆల్తురుపాడు రిజర్వాయర్‌కు సోమశిల – స్వర్ణముఖీ కాల్వ పనులకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వినతి పత్రం అందజేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపివేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సోమశిల స్వర్ణముఖి కాలువ పనులు పూర్తి చేస్తే నెల్లూరు తిరుపతి జిల్లాలకు సాగు, తాగునీరు అందుతుందని చెప్పారు. కండలేరు డ్యాము చెరువులు తదితర అభివృద్ధి పనులపై మంత్రితో ఎమ్మెల్యే రామకృష్ణ చర్చించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కూడా కలిసి అభివృద్ధి విషయంలో చర్చించారు. ఆయన వెంట రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

## తోటలు సారవంతం కోసం గ్లిరి సిడియా మొక్కలు నాటండి

కెవికె అధిపతి డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరి, ఆగస్టు 30, ప్రభాతవార్త



కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన మంత్రి జూన్5న ప్రారంభించిన ఏక్ పేడ్ మా కె నామ్ (ప్లాంట్ ఫర్ మదర్) కార్యక్రమం, వన మహోత్సవంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రంలో కృషి విజ్ఞా కేంద్రం, పెరియావరం నందు గ్లిరిసిడియా, మునగ మొక్కలు నాటడం జరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డా. బి. గోవింద రాజులు వన మహోత్సవంలో భాగంగా గ్లిరిసిడియా, మునగ మొక్కలు నాటడం జరిగింది. గ్లిరిసిడియా మొక్క ఆకులు భూమిలో కలియదున్నడం ద్వారా భూమి సారవంతం అవుతుంది. కావున రైతులు నిమ్మతోటల చుట్టూ గ్లిరిసిడియా నాటుకొని ఆకులు భూమిలో వేసుకొని నేలను సారవంతం చేసుకోవాలని తెలియజేశారు. మునగ మొక్కలుల్లో చాలా ఔషధ గుణాలు ఉంటాయి. అందువల్ల అందరు వారి ఇళ్లలో మునగ చెట్లు పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజీవన, విజయశ్రీ, నాగార్జున రెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

## ఆర్టీసి ఉద్యోగుల డే, నైట్ అవుట్ అలెవెన్స్ చెల్లించాలి

గూడూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ గూడూరు డిపో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. సుబ్రమణ్యం రాజు, జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఈవి కుమార్, తిరుపతి రీజనల్ అధ్యక్షులు గురునాథం, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పాల్గొని వివిధ అంశాలుపై మాట్లాడారు. ఆర్టీసి ఉద్యోగులకు నాలుగు నెలల నుండి రావాల్సిన నైట్ అవుట్ అలెవెన్స్‌లు, డే అవుట్ అలెవెన్స్ కలపాలని, అదే విధంగా విద్యా హర్షత లేని డ్రైవర్స్‌కి రాష్ట్ర మేనేజ్మెంట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం స్కిల్ టెస్ట్ పెట్టి ఎఎస్ 12 సంవత్సరాల ఇంక్రిమెంట్‌లు కలపాలని, అదే విధంగా డిపో ఆవరణంలో జెంట్స్ రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఇంతకుముందు ఉన్నటువంటి గూడూరు నుంచి తిరుమల సర్వీస్‌లను పునరుద్ధరణ చేయాలని, గూడూరు డిపో నుండి అలిపిరి, తిరుపతి, మంగళం డిపోలకి డ్రైవర్స్‌ని రిలీవింగ్ డ్యూటీలకి పంపే విధానాన్ని ఆపి ఇక్కడ నుంచి తిరుమల సర్వీస్‌లు నడిపేటట్లు చూడాలని డిపోలో వివిధ సమస్యలపై డిపో అధ్యక్షులు, కార్యదర్శి వైవి నారాయణ, పి. సుబ్బారావు తెలిపారు. అనంతరం గ్యారేజ్ సీనియర్ మెకానిక్ రవీంద్రనాథ్ 31 ఆగస్టు రిటైర్డ్ సందర్భంగా జనరల్ బాడీ సమావేశంలో పూల మాల, శాలువాతో సన్మానించి చిరు జ్ఞాపికని అందించారు. అనంతరం నూతన డిపో కమిటిని ఎన్నుకున్నారు. గూడూరు డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా వివై నారాయణ, డిపో కార్యదర్శిగా బి. చెంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి. మీరయ్య, ట్రెజరర్‌గా జిలాని భాషలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా గ్యారేజీ కమిటి అధ్యక్షులు ఎం. మధుసూధన, కార్యదర్శిగా ఎం. శ్రీనివాసులుని మిగతా కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా హాజరైన సభ్యులు అందరూ ఎన్నుకున్నారు. సమావేశం అనంతరం ఎన్నికైన కొత్త కమిటీని రాష్ట్ర, తిరుపతి జిల్లా నాయకుల సమక్షంలో గూడూరు డిపో మేనేజర్ ఛాంబర్‌లో పరిచయం చేసుకున్నారు.

## రోడ్డుప్రమాధంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు ...

**దొరవారిసత్రం ఆగస్టు 30 ప్రభాతవార్త;** మండలంలోని నెలబల్లి సమీపంలో జాతీయరహదారిపై జరిగిన రోడ్డుప్రమాధంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సేకరించిన సమాచారం మెరకు వివరాలిలా ఉన్నాయి. తనయాలి గ్రామానికి చెందిన వినయ్,రమేష్‌లు మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటకు వెళ్ళి పనులు పూర్తిచేసుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండలం నెలబల్లి వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు ఒక్కసారిగా అదుపుతప్పి మోటార్‌సైకిల్ బోల్తాపడింది. దీంతో వినయ్,రమేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## వనమహోత్సవంలో

మానుసంపంగి స్థలవృక్షం మొక్కలు –టిటిడి ఈఓ ,అదనపు ఈఓ

తిరుమల,ఆగస్ట్ 30ప్రభాతవార్తప్రతినిధి:



"వనమహోత్సవం"కార్యక్రమంలో శుక్రవారం ఉదయం తిరుమలలోని హరిసదన్ వద్ద మానుసంపంగి స్థలవృక్షం మొక్కలు టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నాటారు. టిటిడి అటవీశాఖ ఆధ్వర్యంలో వందలాదిమానుసంపంగి,చందనం,సీతా అశోక మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిసిఎఫ్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇఒలు భాస్కర్, ఆశాజ్యోతి,ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

## నాణ్యత శుభ్రతతో

తిరుపతిటౌన్,ఆగస్ట్ 30ప్రభాతవార్త:




తెలుగురాష్ట్రాల్లో నేడు మార్కెట్లో పలురకాల వంటనూనెలు లభిస్తున్నా, పోషకవిలువలతో నాణ్యతశుభ్రతతో ఫియోనారిఫైన్డ్ వంటనూనెలు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయని బండే ఇండియా ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫియానా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌బ్రాండ్ సినీనటి లావణ్యత్రిపాఠి ప్రారంభించారన్నారు. రిఫైన్డ్ స్కివర్ నూనెల్లో పోషకవిలువలు, విటమిన్ ఎ,డి,ఇలు ఉన్నాయన్నారు. వంటచేయడానికి అత్యుత్తమ ఎంపికగా ఫియానా నూనెలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తెలంగాణా,ఆంధ్రప్రదేశ్‌లో పోషకమైన వంటనూనెను ప్రారంభించడంతోరెండుమార్కెట్లలోబ్రాండ్‌పరిధినివిస్తరించిందన్నారు. ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారం అందించడం రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో ఫియానా ఎంపిక జరుగుతుందనివిశ్వాసం వ్యక్తం చేశారు.

## గణనాధుని సన్నిధిలో రాష్ట్ర మంత్రి జనార్ధన్‌రెడ్డి



కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త: రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి కుటుంబసమేతంగా శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు,వంసతకుమార్, స్థానిక నాయకులు శేషాద్రినాయుడు, పూర్ణచంద్రరావు, నవీన్‌కుమార్, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పునరుద్ధరించే వరకు పోరాటం

### - డిఇఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నిరసన



చిత్తూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయూలని డిఇఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంను ఉద్దేశించే యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ గతంలో వున్న సిపిఎస్, జిపిఎస్, ప్రస్తుత యుపిఎస్‌లు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కల్గిస్తాయన్నారు. పెన్షన్ అనేది భిక్ష కాదని హక్కు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఖాతరు చేయకుండా అంకెల గారడీ చేసే పెన్షన్‌ల విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం యుటిఎఫ్ నాయకులు డిఇఓ దేవరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సోమశేఖర్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, రెహెనాబేగం, పార్ధసారధి, సరిత, ఎస్‌పి భాషా, రెడ్డప్పనాయుడు, పంటపల్లి సురేష్, గణేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా దేవరాజన్



గుడిపాల, ఆగస్టు 30 ప్రభాతవార్త: జిల్లా ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా సావర్కర్ ట్రస్ట్ ఛైర్మన్ దేవరాజన్ ఎన్నికయ్యారు. చిత్తూరులోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల కోసం సావర్కర్ ట్రస్ట్ అధ్యక్షులు దేవరాజన్ చేసిన కృషిని గుర్తించి అధ్యక్షుడిగా ఆయనను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులుగా వెంకటాచలం, ప్రధాన కార్యదర్శిగా జైకుమార్, నగర అధ్యక్షుడి కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా జయరామయ్య, సహదేవన్ తదితరులు ఎన్నికయ్యారు.

## నేడు ఆదిత్యారెడ్డి పుట్టినరోజు వేడుకలు

### - వైభవంగా సిద్ధమైన ఎన్వీఆర్ హోం



**పుంగనూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త** యువ పారిశ్రామిక వేత్త, నిర్మాణవేత్త, సామాజిక సేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన ఎన్వీఆర్ ట్రస్టు అధినేత వేణుగోపాల్‌రెడ్డి ద్వితీయకుమారుడు ఆదిత్యారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం వైభవంగా జరుగనున్నాయి. మండలంలోని చదళ్ళకు చెందిన యువకుడు వేణుగోపాల్‌రెడ్డి ఒకటిన్నర దశాబ్దం క్రితం బెంగళూరుకు వెళ్ళి భవననిర్మాణవేత్తగా అంచెలంచెలుగా ఎదిగారు. ఈక్రమంలో ఆయన తన స్వంత గడ్డకు సేవచేయాలనే తపనతో ఎన్వీఆర్ ట్రస్టు ఏర్పాటుచేసి పేదలకు అండగా నిలబడ్డారు. విద్యా, ఉపాధి, వైద్య, ఆర్థిక, సామాజిక సేవలలో ఆయనపేరు ఇపుడు ప్రభంజనంగా మారింది. కోట్లు సంపాదించిన రాజకీయవేత్తలెంతమంది ఉన్నా, వేణుగోపాల్‌రెడ్డి దాతృత్వం ముందర దిగదుడుపే. ఆయన రెండో కుమారుడు ఆదిత్యారెడ్డి జన్మదినవేడుకలను శనివారం చదళ్ళ లోని తన ఇంటి వద్ద ఘనంగా నిర్వహించనున్నారు. ఈసందర్భంగా పేదలకు ఆర్ధిక వితరణలు, ఇతర సమాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఆర్.శివకుమార్‌రెడ్డి తెలిపారు.

## శ్రీకాళహస్తిని హరితవనంగా మారటమే బొజ్జల కుటుంబం లక్ష్యం

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత, వనమహోత్సవంలో దేశం నాయకులు



**తొట్టంబేడు, ఆగస్టు 30 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని హరితవనంగా తీర్చి దిద్దటమే లక్ష్యంగా బొజ్జల కుటుంబం పని చేస్తుందని పట్టణపార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు అన్నారు.శుక్రవారం శ్రీవిద్యా ప్రకాశనంద ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు హరితాంధ్ర వన మహోత్సవం సందర్భంగా చెట్టు మాటే కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు అటవీశాఖాధికారి లోకేష్ , వెంకటగిరి సబ్ డిఎఫ్ఓ జ్ఞాప్రకాష్‌రావులు హాజరుకాగా ముఖ్యఅతిధులుగా పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు తొట్టంబేడు తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపిడిఓ సురేష్‌బాబులు హాజరయ్యారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటటం వాటిని సంరక్షించు కోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు తమ జన్మదిన సందర్బంగా శుభ కార్యక్రమాల సందర్బంగా వీలుప డినని మొక్కలు నాటాలన్నారు.ప్రకృతి వైపరీత్యాలు కాలానుగుణంగా వర్షాలు కురవక ఎపోవటం, పర్యావరణంలో మార్పులు గమనిస్తున్నామన్నారు. శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని దీర్ఘకాలం పరిపాలించిన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆటవీశాఖా మాత్యులుగా కేంద్రం నుంచి రూ.5కోట్లు నిధులు సాధించి కైలాసగిరుల్లో హరితాభివృద్ధిని చేపట్టారన్నారు.అంతేకాక నాడు వేయిలిం గాల కోన మార్గం, ఊరందూరు మార్గంలోని రోడ్ల పక్కన నాటిన చెట్లు నేడు హరిత వనాలను మరిపిస్తుందన్నారు. నేడు ఆయన కుమారుడు ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి పర్యావరణం, పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.ఈ కార్యక్రమాల్లో అటవీశాఖాధికారి లోకేష్, డిఆర్‌ఓలు రామకృష్ణ, బాబుప్రసాద్, ఎస్‌ఎస్‌ఓ గిరీశం, రెడ్డప్ప, ఎఫ్‌బిఓలు దాము, రమేష్ సురేష్, గంగాభవానీ, పురుషోత్తం, హేమావతి, గోమతి, హరిబాబు, కళాశాల ప్రిన్సిపల్ కెసి.రేణుకమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

## భూఆక్రమణపై తహసిల్దారు విచారణ



శ్రీరంగరాజపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త: మండల పరిధిలోని వివిపురం పంచాయతీ పెద్దకొండపల్లి గ్రామంలో అటవీ భూఆక్రమణపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు తహసిల్దారు అమరనాథ్ శుక్రవారం గ్రామానికి వెళ్ళి విచారణ నిర్వహించారు. పెద్దకొండపల్లి గ్రామ లెక్కదాఖలు సర్వేనెం.242, 43, 44లపై గ్రామానికి అనుకొని వున్న అటవీ భూములను స్థానికంగా ఓ నాయకుడు పట్టాదారు పాసు పుస్తకంను అక్రమంగా తీసుకున్నారని, ఇప్పటికే గ్రామ యువత కొంత భాగం మార్చిందని, మిగిలిన భూమిని సైతం గ్రామ అవసరాల కోసం గ్రామస్తుల ఆధీనంలోనే వుంచేలా చూడాలని తహసిల్దారును గ్రామస్తులు కోరారు. తహసిల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కదాఖలులో ఈ భూమి అటవీ భూమిగా వుందని, ఆక్రమణకు గురైన భూమి సుమారు 9 ఎకరాలు వుంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్, విఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి రెండు లక్షలు విరాళం

**కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ది పథకాలకు రెండు లక్షల రూపాయలను శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈమేరకు నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన వెల్లా రాకేష్ కుమార్ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే వివిఎన్ ఆర్ కె.ప్రసాద్ అనే భక్తుడు సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేకదర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



















## అడవుల సంరక్షణ అందరి బాధ్యత

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

### - విద్యార్థి దశనుంచే పిల్లలు మొక్కల పెంపకంపై మక్కువ చూపాలి..

### కుప్పంలో ఘనంగా జిల్లాస్థాయి వన మహోత్సవం !!

కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త



ప్రకృతి సంపద అయిన అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నడిమూరు వద్దగల శ్రీవనంలో జిల్లా స్థాయి వనమహోత్సవ కార్యక్రమాన్ని అటవీశాఖచే నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పిడి వికాస్ మర్మత్, అనంతపురం రేంజ్ సిసిఎఫ్ నాగేశ్వరరావు, గుంటూరు రేంజ్ అడిషనల్ పిసిసిఎఫ్ సుమన్, డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమాలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుప్పంలో జిల్లా స్థాయి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గం పరిధిలో 38శాతం మేర అటవీ ప్రాంతం ఉందన్నారు. తద్వారా భూగర్భజలాల పెరిగే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో రైతులు మామిడి, టమోటా, పూల మొక్కల పెంపకం చేపట్టడం జరుగుతోందన్నారు. అడవులు, నదుల ద్వారా ప్రాణుల మనుగడ కొనసాగుతుందన్నారు. విద్యార్థి దశనుంచే పిల్లలు మొక్కల పెంపకంపై మక్కువ చూపాలని సూచించారు. ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ మతాలకు అతీతంగా వన మహోత్సవం జరుపుకోవాల్సిన పండగ అని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ముందుచూపుతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే సమాజాన్ని మార్చగలం అని నమ్మిన వ్యక్తి అన్నారు. గతంలో జన్మభూమి, శ్రమదానం వంటి కార్యక్రమాలను ప్రజల సహకారంతో చేపట్టి అద్భుత మార్పులు తీసుకొచ్చారన్నారు. నేడు అందరూ అదే స్ఫూర్తితో ముందుకుసాగాలని కోరారు. రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు అడుగు వేయాలన్నారు. ఉపాధిహామీ పథకంలో మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ప్రకృతిని కాపాడడంలో అటవీశాఖ పునరంకితం అవుతుందన్నారు. అనంతరం అటవీశాఖచే నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, ఎఫ్ఆర్వో జయశంకర్, డిఆర్వో కృష్ణప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా గల్లా అరుణకుమారి

## స్వీయ చరిత్ర పుస్తక ఆవిష్కరణ

రేణిగుంట, ఆగస్టు 30 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజా కంపెనీస్ లిమిటెడ్ ఆడిటోరియంలో అట్టహాసంగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వీయ రచన గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తక ఆవిష్కరణ రాజన్న ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అట్టహాసంగా జరిగింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథులుగా, విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ముందుగా హాజరైన అతిథులంతా జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తక ఆవిష్కరణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుత్చూ గల్లా అరుణకుమారి రచించిన గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకం తెలుగు రాజకీయాల అంతరాత్మ ఆవిష్కరణగా అభివర్ణించారు. అరుణకుమారిని గొప్ప రచయిత అన్నారు. ఆమెను కథానాయక అనడం కంటే కథా నాయకుడు అనడం సమంజసమన్నారు. చిన్న స్థాయి నుంచి ప్రపంచ దేశాలు తన వైపు చూసేలా రాజకీయ ప్రస్థానంలో ముందుకు సాగుతున్నారన్నారు. ఆమెలోని చైతన్యాన్ని, రాజనీతిని, సంఘసేవను, కవిత్వాభిలాషను ఆమె రచన అద్దం పడుతున్నదన్నారు. పుస్తక ఆవిష్కరణ అనంతరం పలువురు ప్రముఖులు, అతిథులు, రాజకీయ ప్రతినిధులు గల్లా అరుణకుమారిని గజమాలతో, మెమెంటోలతో, శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆవిష్కరణ మహోత్సవంలో ద్రవిడ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ కొలకలూరి మధు జ్యోతి, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత ప్రముఖ రచయిత్రి, వోల్గా, సంపాదకులు హనుమకొండ నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, అమర రాజా ఫౌండర్ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, అమర రాజా, చైర్మన్ వరప్రసాద్, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని, అమరరాజా డైరెక్టర్లు విక్రమ్ గౌరినేని, హర్ష గౌరినేని, అశోక్ గల్లా, సిద్ధార్థ గల్లా, బీజేపీ నాయకులు వెంకటాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



